క్లుప్తంగా

ఆకాశ దీపానికి పూజలు



ఆకాశ దీపానికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దులేటిస్వామి ఆలయంలో కార్తీక మాసం ముగియడంతో ఆకాశ దీపానికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్‌శర్మ, భక్తుల భజన బృందం, అజ్జి, జయరామిరెడ్డి, యండూరి మహేష్, పుల్లయ్య, గోవర్ధన ఆధ్వర్యంలో స్వామివారి మ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివనామస్మరణల మధ్య ధ్వజస్తంభం పై నుంచి ఆకాశ దీపాన్ని కిందకు దించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్



డివైడర్‌ను ఢీకొని ఆగిపోయిన టిప్పర్

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం తప్పించే క్రమంలో టిప్పర్ వాహనం డివైడర్‌ను ఢీకొంది. మంగళవారం తెల్లవారుజామున కర్నూలు వైపు నుంచి బేతంచెర్ల పట్టణం మీదుగా రంగాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న 340 బీ జాతీయ రహదారి నిర్మాణానికి కంకర లోడుతో టిప్పర్ వెళుతోంది. డోన్ క్రాస్ రోడ్డు వద్ద కారు అడ్డు రావడంతో తప్పించే క్రమంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

దివ్యాంగ విద్యార్థికి దుస్తుల పంపిణీ

కోవెలకుంట్ల: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓ పేద దివ్యాంగ విద్యార్థికి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. కోవెలకుంట్లకు చెందిన రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి తన వంతు సాయంగా దుస్తులు అందజేశారు. దివ్యాంగులకు అందరూ నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

పంట మార్పిడితో మంచి ఫలితాలు

డోన్ రూరల్: పంట మార్పిడితో మంచి ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్‌ఖాన్ అన్నారు. మండల పరిధిలోని ఎర్రగుంట్ల, చిన్నమల్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట మార్పిడి చేయడం వల్ల తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. అలాగే పంట కోతలు అయిపోయిన తర్వాత భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల నేల స్వభావం తెలుస్తుందన్నారు. ఫలితంగా పెట్టుబడులు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామ వ్యవసాయసహాయకులు అరవింద్, లత ఉన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

డోన్ టౌన్: పట్టణంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పాత్రికేయులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తహసీల్దార్ నాగమణికి కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వారధిగా ఉండే విలేకరులకు ప్రెస్‌క్లబ్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ ప్రభుత్వ స్థలాలను గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్: ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో న్యూస్ చానల్ రిపోర్టర్ దుర్గాప్రసాద్‌పై దాడికి పాల్పడిన జనసేన నాయకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డోన్ జర్నలిస్టులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా మంగళవారం డోన్ పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డీఎస్పీ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

మెస్సీయ పండుగలు ప్రారంభం

డోన్ టౌన్: సమాజంలో తొలి వారిపై జాలి, దయాగుణం కలిగి ఉన్నప్పుడే ఉత్తమ జీవితం గడుపుతారని రెవరెండ్ పి.నిత్యానందం అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెస్సీయ పండుగల ప్రారంభమయ్యాయి. నాలుగు రోజుల పాటు జరిగే స్తుతి కూడికల్లో ప్రజల సంక్షేమం కోరుతూ, యేసు క్రీస్తు విశ్వాసుల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు, గీతాలాపనలు చేస్తామన్నారు. శుక్రవారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు, మందిర వార్షికోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

డోన్ రూరల్: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకులయ్య డిమాండ్ చేశారు. చిన్నమల్కాపురం పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లతో కలిసి నిరసనలు విడుదల చేశారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ నెల 10వ తేదీ నంద్యాల కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

పరిశ్రమలపై చార్జీల మోత

- వాణిజ్య సముదాయాలపై భారం
- యూనిట్‌కు రూ.0.92 పెంపు
- దిక్కుతోచని స్థితిలో యజమానులు

కొలిమిగుండ్ల: ఎన్నికల ముందు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు పెంచమని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే విద్యుత్ చార్జీలు పెంచేశారు. 2026 నవంబర్ వరకు ఈ బాదుడు వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో నాపరాతి పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. వీటిపై ఆధారపడి పాలిష్ ఫ్యాక్టరీలను నెలకొల్పారు. కొలిమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మండలాల్లో 1500కు పైగానే పాలిష్ ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యాయి. ఇలాగే నాపరాతి గనుల్లో విద్యుత్‌తో పనిచేసే కోత మిషన్‌లను చాలా మంది యజమానులు ఉపయోగిస్తున్నారు. నష్టాల్లో కూరుకుపోతున్న నాపరాతి, పాలిష్ పరిశ్రమలపై విద్యుత్ చార్జీల భారంతో యజమానులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. నష్టాల్లో కొనసాగుతున్న తరుణంలో మళ్లీ ప్రభుత్వం చార్జీలు పెంచడంతో కోలుకోలేని దెబ్బపడింది.

రూ.3 వేల వరకు అదనపు భారం

సర్దుబాటు చార్జీల పేరుతో ప్రభుత్వం పాలిష్ ఫ్యాక్టరీలు, కోత మిషన్‌లకు యూనిట్‌పై రూ.0.92 పైసలు పెంచేసింది. ప్రస్తుతం వివిధ రకాల అదనపు చార్జీలతో కలిపి పాలిష్ ఫ్యాక్టరీలకు యూనిట్‌కు రూ.10 వసూలు చేస్తున్నారు. పెంచిన ధరల ప్రకారం యూనిట్‌పై రూ.11 వసూలు చేస్తున్నారు. తాజాగా డిసెంబర్ నెలకు సంబంధించి రెండు రోజుల నుంచి విద్యుత్ సిబ్బంది మీటర్ రీడింగ్ తీసి యజమానులకు బిల్లులు అందజేస్తున్నారు. సాధారణంగా ఒక్కో పాలిష్ ఫ్యాక్టరీలో నెలకు రెండు వేల నుంచి మూడు వేల యూనిట్ల వరకు విద్యుత్ వాడకం జరుగుతుంటుంది. ఈ లెక్కన యూనిట్‌పై అదనంగా రూపాయి భారం పడుతుంది. గతంలో కంటే ఈనెల నుంచి బిల్లుపై రూ. 2 వేల నుంచి రూ.3 వేల మేర అదనంగా చెల్లించాల్సి వస్తుందని యజమానులు వాపోతున్నారు.



కొలిమిగుండ్లలోని పాలిష్ ఫ్యాక్టరీ



పాలిష్ చేస్తున్న కార్మికులు

మూతపడుతున్న ఫ్యాక్టరీలు

కొద్ది రోజుల నుంచి పాలిష్ పరిశ్రమలు నష్టాల్లో కూరుకుపోయాయి. పాలిష్ రాళ్లకు మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోవడంతో యజమానులు నష్టాలు చవిచూస్తున్నారు. వివిధ రకాల మార్బుల్స్, టైల్స్, పీవీసీలు అందుబాటులోకి రావడంతో పాలిష్ రాళ్ల ఎగుమతి పూర్తిగా తగ్గిపోయింది. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన పరిశ్రమ ప్రమాదపు అంచుల్లో ఉంది. ఇప్పటికే చాలా మంది యజమానులు ఫ్యాక్టరీలను బంద్ చేశారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు కష్టాల్లో ఉన్న పరిశ్రమను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కరెంట్ చార్జీలను పెంచడంతో కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినంత పనైంది. నెలవారీ విద్యుత్ బిల్లులకు సరిపడా ఆదాయం రాకపోవడంతో యజమానులు సందిగ్ధంలో పడ్డారు. మరికొన్ని రోజుల్లో పాలిష్ ఫ్యాక్టరీలు కనుమరుగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

6న వృషభాల రాతిదూలం పోటీలు

సంజామల: అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6న ముదిగేడు గ్రామంలో పాలపండ్ల (ఆరుపండ్ల)లోపు వృషభాల రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రామిరెడ్డి, రాజగోపాల్ రెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు,రూ .15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేలు చొప్పున బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

రేపు గార్లభాల పోటీలు

అంకాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ముదిగేడు గ్రామంలో గురువారం గార్లభాల పోటీలు నిర్వహిస్తున్నట్లు రజక సంఘం నాయకుడు నాగేంద్ర తెలిపారు. విజేతలకు రూ.10వేలు, రూ.5 వేలు, రూ.3వేలు చొప్పున అందిస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న గార్లభాల యజమానులు ఈ నెల 5వ తేదీ ఉదయం 8 గంటలలోపు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

జూదరుల అరెస్ట్

అవుకు: మండల పరిధిలోని రామవరాజుపురం గ్రామ సమీపంలో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5750 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మోదం.. ఖేదం మిగిల్చిన వర్షం

- వరి, పత్తి, కంది పంటలకు నష్టం
- శనగ, జొన్న పంటలకు ఉపయోగం
- అవుకులో 16.6 మి.మీ వర్షం





కోవెలకుంట్ల: ధాన్యం తడవకుండా కప్పిన పట్టలు, బేతంచెర్లలో కోత దశకు వచ్చిన కంది పంట

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు రైతులకు మోదం.. ఖేదంగా మారాయి. మంగళవారం సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో అత్యధికంగా 16.6 మి.మీ, సంజామల మండలంలో 10.6 మి.మీ, కొలిమిగుండ్లలో 7 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 5.8 మి.మీ, దొర్నిపాడులో 6.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఆయా మండలాల పరిధిలో ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉంది. తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు వరి నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 35 వేల వరకు వెచ్చించగా పంట చేతికందే తరుణంలో వర్షం పడడంతో వరికి లవాలి వద్దు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూర్పిడి చేసిన వడ్లు, మొక్కజొన్న దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకుని కాపాడుకుంటున్నారు. వర్షం కారణంగా పత్తి, కంది పంటల్లో పూత, పిందె, కాయలు రాలిపోయాయని వాపోయారు. ఖరీఫ్ పంటలకు వర్షం నష్టం చేకూర్చగా ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు ఉపయోగకరంగా మారాయి. విస్తారంగా సాగైన పప్పుశనగ, జొన్న, మినుము, మొక్కజొన్న, తదితర పంటలు వివిధ దశల్లో ఉన్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఊరట చెందుతున్నారు.

కందిరైతుల ఆందోళన

బేతంచెర్ల: మండలంలో సుమారు 8700 హెక్టార్లలో కంది సాగు చేశారు. కొన్ని గ్రామాల్లో కోత దశకు చేరుకోగా, మరికొన్ని గ్రామాల్లో పూత దశలో ఉంది. తుపాన్ కారణంగా కోత దశకు వచ్చిన కంది పంటతో పాటు పూత దశలో ఉన్న పంటకు సైతం నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 140 హెక్టార్లలో సాగు చేసిన వరి పంట సైతం కోత దశకు చేరుకోవడంతో నేలకొరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఫెంగల్ తుపాన్.. రైతన్నకు నష్టం

బనగానపల్లె: ఫెంగల్ తుపాన్ రైతన్నలకు కన్నీరును మిగిల్చింది. కొద్ది రోజులుగా కురుస్తున్న జల్లులతో నియోజకవర్గంలో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. పంటకల్లాల్లో ఉన్న వరి ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పినా ఉపయోగం ఉండడం లేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల రైతులు తడిసిన ధాన్యాన్ని కల్లాల్లోనే ఆరబోశారు. బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 10–12 వేల హెక్టార్లలో వరి పంటను సాగు చేశారు. ఎకరానికి రూ.30–35 వేలు పెట్టుబడి రాగా దర మాత్రం 75 కిలోల బస్తా రూ.1500 కు మించడం లేదని వాపోతున్నారు. తడిసిన ధాన్యంతో పాటు మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తడిసిన వరి ధాన్యాన్ని ఆరబోసిన దృశ్యం



బనగానపల్లె: వర్షానికి నేలవాలిన వరిపంట



అవుకు: తార్పాలిన్‌తో కప్పివుంచిన ధాన్యం బస్తాలు

పంట నమోదు ఆధారంగానే నష్టపరిహారం

కోవెలకుంట్ల: ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం సంభవిస్తే ఈ-పంట నమోదు ఆధారంగానే నష్ట పరిహారం, ఇన్సూరెన్స్, వ్యవసాయ రాయితీలు వర్తిస్తాయని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్బారెడ్డి అన్నారు. ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మంగళవారం మండలంలోని సౌదరదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఏడీఏ మాట్లాడుతూ.. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల పరిధిలో ఈ ఏడాది పప్పుశనగ, జొన్న, మినుము, మొక్కజొన్న, తదితర పంటలు విస్తారంగా సాగయ్యాయన్నారు. ఆయా పంటలకు సంబంధించి పంటల బీమా రైతులే చెల్లించాలని సూచించారు. అలాగే రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పంట ఉత్పత్తుల కొనుగోలుకు ఈ-పంట ప్రామాణికమన్నారు. సర్పంచ్ మద్దుసూదన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నిరంజన్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు



ధర్మారంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

డోన్ టౌన్: మండలంలోని ధర్మారం గ్రామ రెవెన్యూ పరిధిలో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నక్కల రంగనాయకులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాగమణిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొందరు దళారులు రోడ్డు కంట్రాక్టరుతో కుమ్మక్కై మట్టి తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. దీని వల్ల ఈ ప్రాంతంలోని పూల రైతులు నష్టపోతున్నారన్నారు. నిత్యం వందల సంఖ్యలో భారీ లారీలు మట్టి లోడుతో రాకపోకలు సాగిస్తుండటం వల్ల కమలాపురం రహదారిపై రాళ్లు, మట్టి పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. డోన్ నుంచి నంద్యాల హైవే రోడ్డు నిర్మాణ పనుల కోసం కంట్రాక్టరుకు టెండర్లలో దొరవత్తు నిర్ణయించినా అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

సంజామల: రైతులు ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని మండల ఉద్యాన అధికారిణి ధరణి అన్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు ఉద్యాన శాస్త్రవేత్త ఆదినారాయణతో కలిసి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆయిల్‌పామ్ మొక్కలను ఎకరానికి 57 చొప్పున వంద శాతం రాయితీతో అందజేస్తామని తెలిపారు. పంట 30 ఏళ్ల పాటు రైతుకు లాభసాటిగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. పతంజలి జిల్లా మేనేజర్ మహదేవయ్య, మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపల్లెలో రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి

రైతులకు అండగా ఉంటాం

ప్యాపిలి: రైతులకు అన్ని వేళలా అండగా ఉంటామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో గొర్రెల పెంపకందార్ల శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రైతుల ఆలోచన విధానంలో వచ్చిన మార్పు కారణంగా గ్రామాల్లో ఆవులు, ఎద్దులు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందన్నారు. పశుపోషణ ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయం కూడా సమకూరుతుందన్న విషయాన్ని రైతులు తెలుసుకోవాలన్నారు. అనంతరం చిన్నపొదిల్ల, పెద్దపొదిల్ల, ఊటకొండ, గుడిపాడు, ప్యాపిలి గ్రామాల్లోని చెరువులను పరిశీలించారు. తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, గొర్రెల పెంపకందార్ల శిక్షణ కేంద్రం డీడీ వెంకటరెడ్డి, ఏడీలు రామసుబ్బారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే

వ్యవసాయ గణన పరిశీలన



వ్యవసాయ గణనను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

బనగానపల్లె రూరల్: వ్యవసాయ గణన (2022–23)కు సంబంధించి మూడో విడత సర్వే నివేదికను జిల్లా ఉప గణాంక అధికారి నాగప్రసాద్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని యనకండ్ల గ్రామంలో 2022–23కు సంబంధించి ఎంపిక చేసిన 16 మంది రైతులు ఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో వేశారు? అన్నది తదితర వివరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల ఆహార ధాన్యాల దిగుబడి కొరత తదితర వివరాలు ప్రభుత్వానికి తెలుస్తుందన్నారు. ఆయన వెంట వీఆర్వో ఈశ్వరరెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ యుగంధర్ ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా..డ్రైవర్‌కు గాయాలు

బేతంచెర్ల: నాపరాళ్ల గనిలోకి వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తాపడిన ఘటన మంగళవారం జరిగింది. గనాపల్లె మండలం పలుకూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బేతంచెర్ల సంజీవనగర్ కాలనీకి చెందిన దూదేకుల మౌలాలికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం బేతంచెర్లకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.



చికిత్స పొందుతున్న మౌలాలి

సారా విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న తలారి రామన్నను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

బనగానపల్లె: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. బనగానపల్లెలోని ఎంపీపీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ఉన్న భవిత సెంటర్‌ను నార్మల్ పాఠశాలలో విలీనం చేశామని తెలిపారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు సాధారణ విద్యార్థుల సహాయ సహకారాలు అందిస్తూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం అలీ నవాజ్‌ఖాన్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఇందిర, గురునాథం పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: దివ్యాంగులని హేళన చేయకుండా వారిపై ప్రేమ, సానుభూతి ప్రదర్శించి చేయూతనివ్వాలని కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. దివ్యాంగులను వేధిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నాలుగు శాతం రిజర్వేషన్లను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజు, ఎంఈఓ వెంకటరామిరెడ్డి, హెచ్ఎం మారూఫ్ అబ్బాస్ పాల్గొన్నారు.

డోన్ టౌన్: సమాజంలో వివిధ ప్రతిభావంతులు అవకాశాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని ఎంఈఓ–2 రమానర్సప్ప అన్నారు. కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం నారాయణ, ఉపాధ్యాయులు అబ్దుల్ రఫీ, మునిరాజు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ పురుషోత్తం రెడ్డి, హెచ్ఎంలు అభ్రహం, లక్ష్మీ నాయక్, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు నాగరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దివ్యాంగులు, ఉపాధ్యాయులు



కోవెలకుంట్ల: మాట్లాడుతున్న సీఐ హనుమంతునాయక్



డోన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వెల్లివిరిసిన మతసామరస్యం

బేతంచెర్ల: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మతసామరస్య చైతన్య వేదిక అధ్వర్యంలో ముస్లింలు అయ్యప్పమాలధారులకు మంగళవారం భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హిందూ ముస్లింలు కలిసి మెలిసి ఆదర్శంగా నిలవాలని సంఘం నాయకులు అన్నారు. గురుస్వాములు శేఖర్, మోహన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, నరేంద్ర, మద్దయ్య, మత సామరస్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు నూర్ అహ్మద్, మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.



అయ్యప్పస్వాములకు భిక్ష పెడుతున్న ముస్లింలు

5న సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

బనగానపల్లె రూరల్: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 5న సాగునీటి సంఘాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఈ నెల 8న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికలు ఉంటాయన్నారు. మండలంలోని మొత్తం 22 సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఉండగా ఇందులో ఎస్సార్‌బీసీ సాగునీటి సంఘాలు తొమ్మిది, మైనర్ ఇరిగేషన్ చెరువులకు సంబంధించి 13 సంఘాలకు ఎన్నికలు జరగనున్నట్లు వెల్లడించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



మాట్లాడుతున్న బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి

డోన్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని.. అండగా ఉంటామని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్‌రెడ్డి భరోసా కల్పించారు. మంగళవారం బుగ్గన స్వగృహంలో పార్టీ డోన్ మండల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో డోన్ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావులేకుండా మాజీ మంత్రి బుగ్గన నియోజకవర్గ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేశారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులు పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేవన్నారు. అనంతరం డోన్‌లో ఇటీవల మృతి చెందిన అర్ధవైద్య ప్రముఖుడు బొగ్గరపు చంద్రమౌళి కుటుంబ సభ్యులతో పాటు అనారోగ్యంగా ఉన్న సురేష్‌ను పరామర్శించారు. మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజకుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, పొట్టుప్రసాద్, రామచంద్రుడు, సోమేష్ యాదవ్, హరి, చిరంజీవి పాల్గొన్నారు.